RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారిగా విలేఖరులు కావవలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 304 | 25 శుక్రవారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## కాకినాడలో గ్రీన్ అమ్మోనియా తయారీ, ఎగుమతి కేంద్రం ఏర్పాటుచేయండి



**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్** ప్రముఖ క్రాప్ న్యూట్రిషన్, ఫెర్టిలైజర్స్, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ ఎఎస్ఎ (Yara International ASA - Norway) పబ్లిక్ ఎఫైర్స్ & కమ్యూనికేషన్స్ హెడ్ వైశాలి చోప్రాతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... కాకినాడలో గ్రీన్-అమ్మోనియా మ్యానుఫ్యాక్చరింగ్, ఎక్స్ పోర్ట్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి, అక్కడ ఒక ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను కూడా పరిశీలిం చాలని సూచించారు. ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారం తో పంట-పోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వైశాలి చోప్రా స్పందిస్తూ... యారా ఇండియా (గురుగ్రామ్) పంట పోషణ, వ్యవసాయ శాస్త్రం, డిజిటల్ వ్యవసాయ రంగాల్లో సేవలందిస్తోంది. 17 రాష్ట్రాలలో 1,500 అవుట్‌లెట్‌ల ద్వారా 5.5 మిలియన్ల మంది రైతులకు డిజిటల్‌గా చేరువైందని తెలిపారు. యుపిలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. బయోలాజికల్ క్రాప్ సొల్యూషన్ కోసం కైరాన్ బయోప్రైమ్‌తో భాగస్వామ్యం వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు.

## భారీ వర్షాలపై వైద్యశాఖ అప్రమత్తం

### జ్వరాలు, విరేచనాల నివారణకు ముందస్తు చర్యలు.. వైద్యులు, సిబ్బంది సెలవులు రద్దు

**అమరావతి, రాజధాని వాయిస్** :రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వర్షాలు, వరదల కారణంగా జ్వరాలు, విరేచనాల కేసులు పెరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాల్లో వైద్య బృందా లు, మందులు, పరీక్షా పరికరాలు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని సూచించా రు.అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, తిరుపతి, ఏలూరు, పార్వతీపురం మన్యం, నెల్లూరు, మార్కాపురం, కాకినాడ, శ్రీకాకుళం జిల్లాలతో పాటు పోలవరం ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయాలని, నీరు నిలిచే ప్రాంతాలను తొలగించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.విద్యుత్తు అంతరాయం ఏర్పడే ఆసుపత్రుల్లో జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, అత్యవసర సేవలకు అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. వారం రోజుల్లో ప్రసవించే అవకాశం ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని, ఐదేళ్లలోపు పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. వైద్యులు, వైద్య సిబ్బంది సెలవులు రద్దు చేసినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు తెలిపారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వర్షాలు, వరదలు తగ్గిన తర్వాత కూడా కొంతకాలం ప్రత్యేక వైద్య, పారిశుద్ధ్య చర్యలు కొనసాగించాలని మంత్రి స్పష్టం చేశారు

## మద్యం రవాణా కేసులో అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు

### - శుక్రవారం విచారణకు హాజరు కావాలని ఆదేశం




**హైదరాబాద్, రాజధాని వాయిస్** మద్యం రవాణా కుంభకోణం కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. శుక్రవారం విచారణకు హాజరుకావాలని ఆదేశించింది.ఈడీ దర్యాప్తు ప్రకారం.. సత్తెనపల్లి నియోజకవర్గ వైకాపా నాయకుడు మర్రి సుబ్బారెడ్డి, సత్తెనపల్లి మండల వైకాపా అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ్‌కు సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థల నుంచి మద్యం రవాణా సబ్‌కాంట్రాక్ట్ ఇప్పించడంలో అంబటి రాంబాబు కీలకంగా వ్యవహరించినట్లు అధికారులు గుర్తించారు. ఇందుకోసం అప్పటి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డితో అంబటి మాట్లాడి సిఫారసు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పేర్కొంది.2020 నవంబరు నుంచి 2023 డిసెంబరు వరకు సిగ్మా ట్రాన్స్‌పోర్ట్, 2023 డిసెంబరు నుంచి 2024 డిసెంబరు వరకు ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలు రాష్ట్రస్థాయిలో మద్యం రవాణా కాంట్రాక్టులు నిర్వహించాయి. గుంటూరు-1, గుంటూరు-3 డిపోల సబ్‌కాంట్రాక్టులను సుబ్బారెడ్డి, పురుషోత్తమ్ చేపట్టినట్లు ఈడీ తెలిపింది.నాలుగేళ్లపాటు మద్యం రవాణా ద్వారా ఇద్దరి బ్యాంకు ఖాతాల్లో కలిపి రూ.19.58 కోట్లు జమ అయినట్లు ఈడీ గుర్తించినట్లు సమాచారం. ఆ తర్వాత ఈ మొత్తాన్ని ఇతర ఖాతాలకు మళ్లించడం, నగదు రూపంలో పెద్ద మొత్తంలో ఉపసంహరణలు జరగడం వంటి అంశాలను అధికారులు గుర్తించినట్లు పేర్కొంది.ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందా? అందులో అంబటి రాంబాబు పాత్ర ఏంటి? అనే కోణంలో ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది. సుబ్బారెడ్డి, పురుషోత్తమ్‌లను ముందుంచి తెరవెనుక అంబటి ఈ వ్యవహారాన్ని నడిపించారనే అనుమానంతోనే ఆయనను విచారణకు పిలిచినట్లు సమాచారం.

## స్థానిక ఎన్నికలకు వైసీపీ శ్రేణులు సిద్ధం కావాలి

### ప్రజాదరణ కలిగిన అభ్యర్థులను గుర్తించాలి.. జగన్ కీలక సూచనలు



**తాడేపల్లి, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాల యంలో రీజనల్ కో-ఆర్డినేటర్లతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఎన్నికల కార్యాచరణపై చర్చించారు.స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను వీలైనంత త్వరగా గుర్తించాలని జగన్ ఆదేశించారు. అభ్యర్థుల ఎంపికను ఏకపక్షంగా కాకుండా పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుని, పలు దఫాలుగా చర్చించిన అనంతరం తుది జాబితాను ఖరారు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎంపిక చేసే అభ్యర్థులు భవిష్యత్ సాధారణ ఎన్నికలకు పార్టీకి బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు.ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వైసీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.స్థానిక ఎన్నికల్లో అధికార బలాన్ని ఉపయోగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని జగన్ ఆరోపించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేలా పార్టీ శ్రేణులు ముందస్తుగా సిద్ధం కావాలని, రీజనల్ కో-ఆర్డినేటర్లు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

### సీఈసీ రాజీనామా చేయకుంటే 'జంతర్ మంతర్ 2.0'! - సీజేపీ



**న్యూఢిల్లీ:** ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ప్రధాన ఎన్నికల కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే జంతర్ మంతర్ వద్ద మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించింది. సర్‌పై జాతీయ మీడియాలో వచ్చిన కథనాలతో దుమారం చెలరేగిన నేపథ్యంలో దిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీజేపీ ప్రతినిధులు.. త్వరలో జరగబోయే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలనూ నిలిపివేయాలని డిమాండ్ చేశారు.'రెండు రోజుల్లోగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతాం. అనంతరం దిల్లీలో జంతర్ మంతర్ 2.0 తప్పకుండా చేపట్టి తీరుతాం. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని భావిస్తే విపక్షాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దు. ప్రజాస్వామ్యానికి సీఈసీ ఓ ముప్పులా తయారయ్యారు. ఓటు హక్కు రద్దు చేసేందుకు ఆయన ఎవరు?" అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.సీజేపీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. మూడు డిమాండ్లను ఈసీ ముందు ఉంచుతున్నామని చెప్పారు. సీఈసీ రాజీనామా చేయడంతో పాటు ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. సర్‌ను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని, సర్‌కు సంబంధించిన ఫైళ్లన్నింటినీ సుప్రీం కోర్టు నియమించిన కమిటీ ఆధీనంలో ఉంచాలని కోరారు.

## గురువులపై దాడులు సహించేది లేదు




**అమరావతి,రాజధాని వాయిస్ :** డీఎస్సీ అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చే ప్రయ త్నాల పేరుతో ఉపాధ్యాయులపై దాడులు, బెదిరింపులు చేయడాన్ని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజాస్వా మ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయా లను వ్యక్తం చేసే హక్కు ఉన్నప్పటికీ, ఆ హక్కు పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం అనుమతించబోమన్నారు. ఇటీవల డీఎస్సీ అంశంపై చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో స్పందించిన ఆమె, ఉపాధ్యాయులపై దాడులు లేదా భయాందోళనలు సృష్టించే చర్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో తీవ్రమైన నేరాలుగా పరిగణిం చబడతాయని హెచ్చరించారు.ప్రజలకు సంబంధించిన అంశాలపై ప్రశ్నలు అడగడానికి, ప్రభుత్వ నిర్ణయాలను నిలదీయడానికి ప్రజాస్వామ్యంలో అసెంబ్లీ వంటి వేదికలు ఉన్నాయని అనిత పేర్కొన్నారు. అలాగే న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే అవకాశాలు కూడా అందరికీ అందుబా టులో ఉన్నాయని గుర్తు చేశారు. అలాంటి చట్టబద్ధ మార్గాలను పక్కనబెట్టి దాడులు, బెదిరింపులు, హింసాత్మక చర్యలకు దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య ంలో విభేదాలు సహజమే అయినప్పటికీ వాటి పరిష్కారం కూడా ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే జరగాలని ఆమె అన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతలను దెబ్బతీయడానికి కొందరు ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్త పరిస్థితులను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అనిత ఆరోపించారు. భయానక వాతావరణాన్ని సృష్టించి ప్రజల్లో ఆందోళన పెంచడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు జరుగుతు న్నాయని పేర్కొన్నారు. అలాంటి చర్యలను ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత వారి భుజాలపై ఉంటుందని అనిత అన్నారు. అలాంటి గురువుల గౌరవానికి భంగం కలిగించే చర్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని తెలిపారు. ఉపాధ్యాయులపై దాడులు చేయడం అంటే విద్యా వ్యవస్థపైనే దాడి చేసినట్టేనని పేర్కొన్నారు. వారి భద్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నా మని, అవసరమైన అన్ని రక్షణ చర్యలు చేపడతామని వెల్లడించారు.రాష్ట్ర ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం రాజీపడే ప్రసక్తే లేదని హోంమంత్రి స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి అల్లర్లు, దాడులు లేదా బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్యక్తులు ఎంత ప్రభావశీలులైనా, ఏ రాజకీయ నేపథ్యం కలిగి ఉన్నా చట్టం తన పని తాను చేస్తుందని పేర్కొన్నారు. చట్టపరమైన వ్యవస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండాలని ఆమె సూచించారు. ప్రశాంతమైన ఆంధ్రప్రదేశ్‌ను అస్థిరత, విధ్వంసం వైపు నడిపించాలనే ప్రయత్నాలు ఎవరైనా చేసినా ప్రభుత్వం ఉపేక్షించబోదని అనిత హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సామాజిక సామరస్యం కోసం శాంతియుత వాతావరణం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అందుకే శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రతి చర్యను కఠినంగా అడ్డుకుంటామని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ఎవరూ చట్టానికి అతీతులు కారనే స్పష్టమైన సందేశాన్ని ప్రభుత్వం మరోసారి ఇస్తోందని ఆమె అన్నారు.

## ప్రవాహాలతో రిజర్వాయర్లు, చెరువులు నింపాలి

### - చెరువులు నింపేందుకు మొబైల్ లిఫ్ట్ లు - పడుతున్న వర్షాలతో భూగర్భజలాల రీఛార్జ్

### - రాష్ట్రంలో వర్షాలు, నీటి ప్రవాహాలపై ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి, రాజధాని వాయిస్ :** వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు పరిధిలో ఉన్న వివిధ నీటి వనరుల్ని కూడా నింపాలని స్పష్టం చేశారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగం, డేటా అనలిటిక్స్, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావంపై సీఎం చర్చించారు. తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో గడచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భజలాలు కొంత మేర పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రకాశం బ్యారేజి సహా మున్నేరు సహా ఇతర క్యాచ్ మెంట్ ఏరియా నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని అన్నారు. ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో వర్షపు నీటిని నిల్వ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట మోటార్లను వాడి నీటిని లిఫ్ట్ చేయాలని స్పష్టం చేశారు. గోదావరి నుంచి వస్తున్న ప్రవాహాల ద్వారా 24 టీఎంసీల నీటిని ఏలేరు రిజర్వాయర్ నింపాలని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ నీటి వనరుల్లోకి నీటిని పంపాలన్నారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో వర్షాలు అధికంగా నమోదు అయ్యాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా వివిధ జిల్లాల్లో తీవ్ర వర్ష ప్రభావం కనిపించిందని తెలిపారు.



**గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి**

ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలు, గాలుల తీవ్రత, నదులు--వాగుల్లో పెరుగుతున్న ప్రవాహాలు, రిజర్వాయర్లలోకి చేరుతున్న వరద నీరు, రాబోయే రోజుల్లో అంచనా వేసిన వర్షపాతంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. తాజా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## బీసీ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడాలి

**తాడేపల్లి/అమరావతి, రాజధాని వాయిస్** : ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని, బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకునే విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా హాస్టళ్లు, గురుకులాల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, విద్యార్థులు అస్వస్థతకు గురైతే తక్షణమే మెరుగైన విద్యమందించాలని స్పష్టంచేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, పలువురు కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సవిత గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణకు మంత్రి సవిత కీలక ఆదేశాలు జారీచేశారు.



రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ, విద్యార్థుల యోగా క్షేమాలను గమనిస్తూ ఉండాలన్నారు. వేడి, తాజా ఆహారం మాత్రమే అందించాలని స్పష్టంచేశారు. బయట ఆహారాన్ని లోపలికి రానివ్వొద్దని, కాచి చల్లార్చిన నీటి మాత్రమే అందివ్వాలని తెలిపారు. హాస్టళ్లు, గురుకులాల చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వ్యాధులు ప్రబలక ముందే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు అస్వస్థతకు గురి కాగానే సమీప ఆసుపత్రులకు తరలించాలన్నారు. పాత భవనాల్లో ఉన్న విద్యార్థులను సురక్షిత భవనాల్లోకి తరలించాలని మంత్రి సవిత ఆదేశించారు.

## వర్షాల నేపథ్యంలో ప్రత్యేక కాల్‌సెంటర్లను ఏర్పాటు చేయండి: మంత్రి నారాయణ

**అమరావతి, రాజధాని వాయిస్ :** వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా నిరంతర పర్యవేక్షిం చాలన్నారు. డ్రెయిన్లలో సిల్ట్ తొలగించి మురుగునీటి ప్రవాహం సాఫీగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఇంజనీ రింగ్, పారిశుధ్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాల ని ఆదేశించారు. రోడ్లపై విరిగిపడిన చెట్ల తొలగించేందుకు అవసరమైన యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవా లని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. ఈ మేరకు ప్రతి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి తగిన వనరులను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి నారాయణ సూచనలు జారీ చేశారు.

## అక్టోబర్ 1 మధ్యాహ్నం నుంచే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ

**అమరావతి, రాజధాని వాయిస్ :** సమ్మె కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకులకు వరుస సెలవుల ఉన్నా పింఛనుదారులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. గురువారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్1వ తేదీ మధ్యాహ్నం నుంచే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేపడతామని తెలిపారు. అక్టోబర్ 1 ఉదయం నగదు విత్‌డ్రా చేసుకునేలా బ్యాంకులకు ఎస్ఎల్‌బీసీ ఆదేశాలు ఇచ్చిందని అన్నారు.ఉదయం బ్యాంకుల నుంచి నగదు తీసుకుని మధ్యాహ్నం నుంచే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ పంపిణీ విధానంలో మార్పును గమనించి సహకరిం చాలని ఈ సందర్భంగా పింఛనుదారులకు మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. 61.80 లక్షల మంది పింఛను దారుల కోసం రూ.2,692.34 కోట్లు విడుదల చేస్తున్నట్లు వివరించారు. రూ.2,675.63 కోట్లు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు పింఛను ఖాతాలకు జమ చేస్తామని వివరించారు. రూ.16.65 కోట్లు పింఛనుదారుల ఖాతాల్లో డీబీటీ ద్వారా జమ చేస్తామన్నారు. గజపతినగరం మండలంలో ఎస్ఎన్ఏ స్పర్శ్ విధానంలో డీబీటీ పైలట్ అమలు చేస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

## పాతిక లక్షలు పలికిన బందరు మహా గణపతి లడ్డూ ప్రసాదం

**మచిలీపట్నం,రాజధాని వాయిస్ :** బందరు తీరంలో ఏర్పాటు చేసిన మహాగణపతి లడ్డూరూ. 25 లక్షలు పలికింది. ఈ లడ్డూను ఎఫ్‌సీఎస్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత గుమ్మడి భవానీ శంకర్ దక్కించుకున్నారు. ఈ మేరకు 630 కేజీల స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని భవానీ శంకర్‌కు ఇవ్వనున్నట్లు ఉత్సవ కమిటీ అధికారికంగా ప్రకటించింది. ఆఫ్ లైన్, ఆన్ లైన్‌లో నిర్వహించిన ఈ వేలం పాటలో సుమారు 600 మంది భక్తులు పాల్గొన్నారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. లడ్డూ వేలం మొదటగా రూ. 63 వేలతో ప్రారంభమైనట్లు వారు తెలిపారు. కాగా.. రేపు జరగనున్న వరసిద్ధి వినాయక స్వామి కల్యాణ ఉత్సవాలకు భవానీ శంకర్ దంపతులు హాజరుకానున్నారు. అనంతరం ఫైర్ జెట్‌ల సహాయంతో 63 అడుగుల మహా గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

**సంగారెడ్డి జిల్లాలో రూ. 36 లక్షలు పలికిన లడ్డూ**

న్యాల్‌కల్ మండలం రాఘవాపూర్‌లోని సరస్వతి ఆలయంలో ప్రతిష్టించిన గణేశుని లడ్డూ ప్రసాదం రూ. 36 లక్షలు పలికింది. సదాశివ పేటకు చెందిన చింతల్ గట్టు వీరన్న అనే భక్తుడు ఈ లడ్డూను సొంతం చేసుకున్నారు.

## సినిమా హిట్ అయితే కొమ్ములు వచ్చినట్టు ఎగరకూడదు: హీరో సుమన్

**నెల్లూరు, రాజధాని వాయిస్ :** 'సినిమా హిట్ అయిందని కొమ్ములు వచ్చినట్టు ఎగరకూడదు.. ఒళ్ళు దగ్గర పెట్టుకొని మెదలాలి' అని ప్రముఖ సినీ నటుడు సుమన్ హాట్ కామెంట్స్ చేశారు. నెల్లూరు జిల్లాలోని వెంకటగిరిలో ఓ ప్రైవేటు ఆసుపత్రి కార్యక్రమంలో పాల్గొన్న సుమన్ ఈ వ్యాఖ్యలు చేశారు.'ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో కొత్తగా పనిచేస్తున్న కొంతమంది నటీనటులకు క్రమశిక్షణ తక్కువగా ఉంది. షూటింగ్‌లకు లేటుగా వస్తున్నారు. ఎవరినీ కేర్ చేయడం లేదు. సెట్లలో అన్ని విషయాల్లో వేలు పెడుతున్నారు. అవి మార్చమని.. ఇవి మార్చమని సలహాలు ఇస్తున్నారు. డైరెక్టర్, ప్రొడ్యూసర్లకు మనం సహకరిస్తేనే.. సినిమా ఫ్లాప్ అయినా అవకాశాలు ఉంటాయి. ఈ రోజుల్లో ఒక్కసారి మార్కెట్ పోతే ఎవరైనా సరే.. అవుట్ అవ్వాల్సిందే. సినిమా హిట్ అయిందని కొమ్ములు వచ్చినట్టు ఎగరకూడదు. ఒళ్ళు దగ్గర పెట్టుకుని పనిచేయాలి' అని సుమన్ హితవు పలికారు.

## తీరం దాటిన తీవ్ర వాయుగుండం.. ఇంకా పొంచివున్న ముప్పు

**విశాఖపట్నం,రాజధాని వాయిస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడడంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. నిన్న రాత్రి కళింగపట్నానికి సమీపంలో తీవ్ర వాయుగుండం తీరం దాటింది. అయినప్పటికీ ప్రమాదం ఇంకా పొంచి ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

**ఇంకా పొంచివున్న ముప్పు**

ప్రస్తుతం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాల మధ్య తీవ్రవాయుగుండం కేంద్రీకృతం అయిందని వాతావరణ నిపుణులు తెలియజేశారు. అయితే.. ఈ తీవ్ర వాయుగుండం ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్న క్రమంలో బలహీనపడుతూ.. వాయుగుండంగా మారే అవకాశం ఉందని వారు తెలిపారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్స్ జారీ చేసింది.

# తుఫాన్ నష్టంపై మంత్రి క్షేత్రస్థాయి పరిశీలన

- దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన అచ్చెన్నాయుడు
- రైతులకు నష్టం తగ్గించే చర్యలకు ఆదేశం
- పొలాల్లో నిల్వ నీటిని వెంటనే మళ్లించాలని సూచన
- రహదారులు, వంతెన పునర్నిర్మాణానికి ప్రాధాన్యం



**టెక్కలి, రాజధాని వాయిస్ :** టెక్కలి నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను రాష్ట్ర మంత్రి అచ్చెన్నా యుడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా నష్టపోయిన రహదారులు, వంతెనలు, పంట పొలాలను సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా అంచనా వేశారు. తుఫాన్ ప్రభావంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. నష్టం వివరాలను సేకరించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయ భూముల్లో భారీగా నీరు నిల్వ ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని మంత్రి పేర్కొన్నారు. పంట పొలాల్లో నిలిచిపో యిన నీటిని అత్యవసర ప్రాతిపదికన బయటకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండటం వల్ల పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, రైతులకు నష్టం తగ్గించే దిశగా యంత్రాంగం వేగంగా పనిచేయా లని సూచించారు. అవసరమైన చోట మోటార్లు, డ్రైనేజీ సౌకర్యాలు వినియోగించాలని చెప్పారు.తుఫాన్ కారణంగా పలు గ్రామీణ రహదారులు దెబ్బతినడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడినట్లు పరిశీలనలో గుర్తించారు. రహదారుల మరమ్మతు పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. విద్యార్థులు, రైతులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు పడకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. దెబ్బతిన్న ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను సాధారణ స్థితికి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నందిగామ ప్రాంతంలో కూలిపోయిన వంతెన పరిస్థితిని కూడా మంత్రి పరిశీలించారు. వంతెన దెబ్బతినడంతో స్థానిక ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోందని గుర్తించారు. ఈ నేపథ్యంలో పునర్ని ర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సాంకే తిక నిపుణులతో సమన్వయం చేసి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సహాయం అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, రహదారి సౌకర్యాల పునరుద్ధర ణపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థా యిలో నిరంతరం పర్యటిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. బాధితులకు ప్రభుత్వ సహాయం వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుం దని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. పంట నష్టం, మౌలిక వసతుల నష్టం, ప్రజలకు ఎదురైన ఇబ్బందులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను సాధారణ పరిస్థితులకు తీసుకురావడానికి యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## గోద్రేజ్ గ్రూప్‌కు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఆహ్వానం

- గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ సమావేశం
- వ్యవసాయ రసాయనాలు, పాల ప్రాసెసింగ్, ఆయిల్‌పామ్ రంగాల్లో పెట్టుబడులపై చర్చ
- రాష్ట్రంలో కార్యకలాపాల విస్తరణకు ఆహ్వానం
- విస్తృత భాగస్వామ్యంపై ఆశాభావం



**న్యూఢిల్లీ,రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల విస్తరణకు గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. మంత్రి నారా లోకేష్ గురువారం గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ అధ్యక్షుడు రాకేష్ స్వామి, ఆయన బృందంతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత రంగాల అభివృద్ధికి ఉన్న అవకాశాలపై ఈ సందర్భంగా చర్చించారు. సమావేశంలో వ్యవసాయ రసాయనాలు, పాల ప్రాసెసింగ్, ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ రంగాల్లో గోద్రేజ్ గ్రూప్ కార్యకలాపాలను విస్తరించే అవకాశాలను మంత్రి వివరించారు. వ్యవసాయానికి అనుకూల వాతావరణం, సమృద్ధిగా లభించే ముడి పదార్థాలు, పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి తెలియజేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెంచేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.ప్రస్తుతం గోద్రేజ్ ఆగ్రోవెట్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టి కార్యకలాపాలు నిర్వహిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఆ అనుబంధాన్ని మరింత విస్తరించి పలు రంగాల్లో కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి ద్వారా రైతులకు మెరుగైన అవకాశాలు, ఉపాధి కల్పనకు దోహదం అవుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని సమావేశంలో చర్చించారు. ఈ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబ డులు వస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. పరిశ్రమల ద్వారా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు.గోద్రేజ్ గ్రూప్‌తో రాష్ట్ర ప్రభుత్వానికి దీర్ఘకాలిక భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని లోకేష్ పేర్కొన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ, మౌలిక వసతుల కల్పన ద్వారా పరిశ్రమలకు ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తోందన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక, వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. సమావేశం అనంతరం గోద్రేజ్ గ్రూప్‌తో మరింత విస్తృత, వైవిధ్యభరిత భాగస్వామ్యాన్ని నిర్మించాలనే ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల పెరుగుదల ద్వారా ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన, రైతుల ఆదాయ వృద్ధికి తోడ్పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నా రు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## పార్టనర్షిప్ సమ్మిట్ -2026 సన్నాహకాలపై సీఎం సమీక్ష



**అమరావతి, రాజధాని వాయిస్ :** విశాఖపట్నంలో నవంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న 31వ సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్-2026 సన్నాహకాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీ. సాయిప్ర సాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.సదస్సుకు ముందుగా రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో రీజినల్ సదస్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, అనంత పురం, తిరుపతిలో ఈ సదస్సులు నిర్వహించి భారీ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ చేపట్టాలని సూచిం చారు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతలు, పారిశ్రామిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని చర్చలు నిర్వహి ంచాలని పేర్కొన్నారు. పెట్టుబడుల ఒప్పందాలకే పరిమితం కాకుండా, యువ పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినిచ్చేలా, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ విలువను మరింత పెంచేలా సదస్సును నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.పెట్టుబడులతో పాటు పరిశ్రమలు, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక వృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా చర్చలు జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా భాగస్వామ్య సదస్సు కీలక వేదికగా నిలవాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో అధికారులు వివరాలిస్తూ, 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ.22.57 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 714 అవగాహన ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. వాటిలో రూ.16.6 లక్షల కోట్ల విలువైన 473 ప్రాజెక్టులు అమలు దశలోకి ప్రవేశించాయని, ఇప్పటికే 247 ప్రాజెక్టులు భూమిపై కార్యరూపం దాల్చినట్లు వెల్లడించారు.

## చెరకు రైతుల బకాయిలకు రూ.28 కోట్లు



**అమరావతి, రాజధాని వాయిస్ :** చోడవరం సహకార చక్కెర కర్మాగారానికి చెరకు సరఫరా చేసిన రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైతులకు బకాయిల చెల్లింపుల కోసం రూ.28 కోట్ల విడుదలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు ఎమ్మెల్సీ నాగబాబు వెల్లడించారు. ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా తనను కలిసిన చోడవరం ప్రాంత చెరకు రైతులు, షుగర్ ఫ్యాక్టరీ నుంచి అందాల్సిన బకాయిల విషయాన్ని తన దృష్టికి తీసుకువచ్చారని నాగబాబు తెలిపారు. రైతులతో సుదీర్ఘంగా చర్చించి సమస్య తీవ్రతను తెలుసుకున్న అనంతరం దీనిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.శాసన మండలి సమావేశాల్లో తన తొలి ప్రశ్నను చెరకు రైతుల సమస్యపైనే అడిగినట్లు నాగబాబు వివరించారు. రైతుల తరఫున పలుమార్లు సంబంధిత శాఖ మంత్రులతో చర్చించి, పెండింగ్ బకాయిల చెల్లింపుల అంశాన్ని ప్రాధాన్యతతో ప్రస్తావించినట్లు చెప్పారు. రైతుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయంతో చోడవరం సహకార చక్కెర కర్మాగారానికి చెరకు సరఫరా చేసిన రైతులకు బకాయిల చెల్లింపుల ప్రక్రియ వేగవంతం కానుంది. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న రైతులకు ఈ నిర్ణయం ఆర్థికంగా ఊరటనివ్వనుందని వ్యవసాయ వర్గాలు భావిస్తున్నాయి.ఈ సందర్భంగా రైతుల సమస్యను పరిష్కరించేందుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సంబంధిత శాఖ మంత్రులు, ప్రజాప్రతినిధులకు నాగబాబు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని ఈ నిర్ణయం మరోసారి స్పష్టం చేసిందన్నారు. చెరకు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు వ్యవసాయ రంగానికి బలం చేకూర్చనున్నాయని, భవిష్యత్తులో కూడా రైతుల ప్రయోజనాల పరిరక్షణకు కృషి కొనసాగుతుందని నాగబాబు పేర్కొన్నారు. రైతుల శ్రమకు తగిన గౌరవం, గిట్టుబాటు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## చింతలచేను వంతెన ప్రారంభంపై నిరసన



**తిరుపతి, రాజధాని వాయిస్ :** చింతలచేను ప్రాంతంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురు వారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అండర్ బ్రిడ్జి ప్రారంభంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసించారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన కీలక మౌలిక సదుపా యం ప్రారంభం కాకపోవడం వల్ల రోజువారీ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌సీ-107 రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు మూడు నెలల కిందటే పూర్తయ్యాయని తెలిపారు. జూన్ 22న రైల్వే డివిజనల్ ఇంజనీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు లేఖ రాసి పనులు పూర్తయ్యాయని తెలియజేసిన ప్పటికీ, ఇప్పటివరకు ప్రారంభోత్సవం జరగకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ప్రజల అవసరాలకు సంబంధిం చిన పనుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 2023 సంవత్సరంలో మున్సిపల్ కార్పొరేషన్ ఈ అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. నిర్మాణం పూర్తయి ప్రజలకు ఉపయోగపడే స్థితిలో ఉన్నప్పటికీ అందుబాటులోకి తీసుకురాకపోవడం వెనుక కారణాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాకపోకలకు కీలకమైన ఈ మార్గం ప్రారంభం కాకపోవడం వల్ల స్థానిక ప్రజలు, వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.తిరుపతి నగరంలో తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని అభినయ్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు తాగునీరు అందించే విషయంలో సంబంధిత అధికారులు, పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి కూడా పలు ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందని, కొన్ని వర్గాలపై ఒత్తిళ్లు తీసుకువస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించే విధంగా ఎన్నికల నిర్వహణ జరగాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలు జరుగుతు న్నాయని ఆరోపించారు. చింతలచేను రైల్వే అండర్ బ్రిడ్జిని వెంటనే ప్రారంభించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడే ఈ మౌలిక సదుపాయాన్ని రాజకీయ కారణాలతో ఆలస్యం చేయవద్దని సూచించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అండర్ బ్రిడ్జిని ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ శిరీష, మల్లం రవిచంద్రారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ ఆర్ సర్వే వేగవంతం

- శనివారంలోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశం
- పెండింగ్ అభ్యంతరాల పరిష్కారానికి గడువు
- భూ సమీకరణ పనుల్లో పురోగతిపై సమీక్ష
- నిబంధనల అమలులో రాజీ పడొద్దని సూచన



**గుంటూరు, రాజధాని వాయిస్ :** సి.ఆర్.డి.ఏ పరిధిలో కొనసాగుతున్న ఆర్ అండ్ ఆర్ సర్వే పనులను వేగవంతం చేసి శనివారం నాటికి పూర్తి చేసి ప్రచురణ దశకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. భూ సమీకరణ ప్రక్రియలో జాప్యం లేకుండా పనులు పూర్తి చేయడంతో పాటు ప్రతి దశలో రికార్డుల పరంగా పూర్తి పారదర్శకత ఉండేలా చూడాలని సూచించారు. రైతులు, భూ యజమానులకు సంబంధించిన వివరాలు ఎటువంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఆర్.డి.ఏ భూ సమీకరణ, ఆర్ అండ్ ఆర్ సర్వే, ఇతర అనుబంధ అంశాల పురోగతిని అధికారులు వివరించారు. వివిధ మండలాలు, గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే పనులపై కలెక్టర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. నిర్ణయించిన గడువుల ప్రకారం అన్ని కార్యక్రమాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.భూ సమీకరణకు సంబంధించిన ప్రతి రికార్డు పక్కాగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. భూముల యాజమాన్యానికి సంబంధించిన ఆధారాలు, సర్వే వివరాలు, నమోదు ప్రక్రియలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. భవిష్యత్తులో వివాదాలకు తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు. ఏ చిన్న నిర్లక్ష్యం జరిగినా మొత్తం ప్రక్రియపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. సబ్‌డివిజన్‌కు సంబంధించిన పనులను వచ్చే గురువారం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టమైన గడువు విధించారు. అలాగే వివిధ గ్రామాల నుంచి వచ్చిన పెండింగ్ అభ్యంతరాలను ఈ వారంలోనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను సానుకూలంగా పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యంతరాల పరిష్కారంలో జాప్యం జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని చెప్పారు.భూ సమీకరణ ప్రక్రియలో ప్రతి వారం స్పష్టమైన పురోగతి కనిపించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పర్యటిస్తూ పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. నిర్ణయించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు సాగుతున్నాయా లేదా అనే అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన కీలక కార్యక్రమం కావడంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. సమీక్ష సమావేశంలో సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ ఏ.భార్గవ్ తేజ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, సి.ఆర్.డి.ఏ డిప్యూటీ కలెక్టర్లు తదితర అధికారులు పాల్గొన్నారు. భూ సమీకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువుల్లో లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. అధికారులు తమ శాఖల వారీగా పురోగతి నివేదికలను సమర్పించి చేపట్టిన చర్యలను వివరించారు.

# జీజీహెచ్ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్ర భవన ప్రణాళిక రూపొందించాలని ఆదేశం
- రూ.5.27 కోట్లతో నిర్మాణ పనులకు సన్నాహాలు
- ప్లాస్టిక్ సర్జరీ వార్డు పనులను పరిశీలించిన కలెక్టర్
- పారిశుధ్యం, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి





**గుంటూరు, రాజధాని వాయిస్ :** ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో చేపట్టనున్న భవన నిర్మాణ పనులు భవిష్యత్ అవస రాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాల ని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సి.ఎస్.ఆర్ నిధుల కింద రూ.5.27 కోట్ల వ్యయం తో చేపట్టనున్న నిర్మాణ కార్యక్రమాలపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి విస్తరణ, వైద్య సేవల మెరుగుదల, రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ డిజైన్లను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో భవన నిర్మాణ నమూనాలు, విభాగాల అవసరాలు, భవిష్యత్ విస్తరణ అవకాశాలపై చర్చించారు. నిర్మాణ ప్రణాళికల్లో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని ప్రతి విభాగానికి అవసరమైన మౌలిక వసతుల వివరాలను సంబంధిత విభాగాధిపతులు అందించాలని ఆదేశించారు. రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలను చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం ప్లాస్టిక్ సర్జరీ వార్డు నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భవిష్యత్తులో నీటి లీకేజీలు లేదా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లకు సూచించారు. నిర్మాణ ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జీజీహెచ్‌లో పారిశుధ్య పరిస్థితులపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వచ్చే నెల రోజుల్లో ఆసుపత్రి పరిసరాలు, ఓపీ విభాగం, మరుగుదొడ్లు తదితర ప్రాంతాల్లో పరిశుభ్రతను గణనీయంగా మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. రోగులు, వారి బంధువులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ఆసుపత్రి యాజమాన్య బాధ్యత అని స్పష్టం చేశారు.వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. వైద్య సేవల నాణ్యతతో పాటు రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిని ఆదర్శవంతమైన వైద్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రి అభివృద్ధి పనులు, మౌలిక వసతుల విస్తరణ, పారిశుధ్య మెరుగుదల వంటి అంశాలపై సమగ్ర చర్చ జరిగింది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

# డిప్యూటీ సీఎం పవన్‌తో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ భేటీ

**అమరావతి, సెప్టెంబర్ 24 రాజధాని వాయిస్ :** మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో.. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయ అంశాలతో పాటు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. పవన్ కల్యాణ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న శాఖల్లో తీసుకొస్తున్న మార్పులు, చేపడుతున్న సంస్కరణలను వంగవీటి రాధాకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. ఇరువురి మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న స్నేహం నేపథ్యంలో.. గతంలో ప్రజారాజ్యం పార్టీలో కలిసి పనిచేసిన రోజులు, 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రచార సమయంలో చోటుచేసుకున్న పలు అంశాలను వారు గుర్తుచేసుకున్నారు.



# గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌తో నారా లోకేశ్ భేటీ..

రెండు రాష్ట్రాల మధ్య 'కోస్ట్ టు కోస్ట్' కారిడార్
గుజరాత్‌తో ఏపీ భాగస్వామ్యం
ఏపీ, గుజరాత్ మధ్య 'కోస్ట్ టు కోస్ట్' వాణిజ్య కారిడార్ ఏర్పాటుపై చర్చ
గిఫ్ట్ సిటీ తరహాలో వైజాగ్, అమరావతిలో బిజినెస్ డిస్ట్రిక్టుల అభివృద్ధికి సహకారం కోరిన లోకేశ్
గుజరాత్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమి కేటాయించాలని విజ్ఞప్తి
విజయవాడ ఉత్సవ్‌కు రావాల్సిందిగా గుజరాత్ సీఎంకు ప్రత్యేక ఆహ్వానం



**అమరావతి, రాజధాని వాయిస్** ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడింది. గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు తీరప్రాంత రాష్ట్రాల పరస్పర సహకారంతో దేశాభివృద్ధికి దోహదపడే పలు కీలక ప్రతిపాదనలను ఆయన ముఖ్యమంత్రి ముందుంచారు. ముఖ్యంగా, గుజరాత్ పశ్చిమ తీరాన్ని, ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరాన్ని కలుపుతూ 'కోస్ట్ టు కోస్ట్' వాణిజ్య కారిడార్ ఏర్పాటు ఆవశ్యకతను లోకేశ్ నొక్కిచెప్పారు. ఈ భేటీలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. దేశ ఆర్థిక ప్రగతిలో కీలకమైన తీరప్రాంత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, గుజరాత్ ఏకతాటిపై నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. తూర్పు తీరానికి గేట్‌వేగా ఉన్న ఏపీ, పశ్చిమ తీరంలో కీలకంగా ఉన్న గుజరాత్ సమన్వయంతో పనిచేస్తే సముద్ర, పోర్టుల ఆధారిత పరిశ్రమలు గణనీయమైన వృద్ధిని సాధిస్తాయని వివరించారు. గుజరాత్ మోడల్ స్ఫూర్తితోనే ఏపీలో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట వంటి నాన్-మేజర్ పోర్టులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పోర్టుల ఆధారిత పారిశ్రామికీకరణ, ప్రైవేట్ పోర్టుల నిర్వహణలో ఉత్తమ పద్ధతులను పంచుకునేందుకు 'కోస్ట్ టు కోస్ట్' లాజిస్టిక్స్, వాణిజ్య కారిడార్ ఎంతో ఉపకరిస్తుందని ప్రతిపాదించారు.గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ ఫ్రేమ్‌వర్క్‌ను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. దీనిని ఆదర్శంగా తీసుకుని, ఏపీలోని విశాఖపట్నం, అమరావతి ప్రాంతాల్లో ఆధునిక బిజినెస్ డిస్ట్రిక్ట్‌లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గిఫ్ట్ సిటీలో అమలు చేస్తున్న సింగిల్-విండో క్లియరెన్స్, డెవలపర్లకు ఇచ్చే ప్రోత్సాహకాలపై తమకు అవగాహన కల్పించి, సాంకేతిక సహకారం అందించాలని కోరారు. ఏపీలో సెమీకండక్టర్, గ్రీన్ హైడ్రోజన్ (కాకినాడ హబ్), ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల (కొప్పర్తి, ఓర్వకల్లు) ఏర్పాటు ద్వారా పారిశ్రామిక సప్లయ్ చైన్‌ను పటిష్ఠం చేస్తున్నామని సీఎంకు వివరించారు.అదేవిధంగా, అక్టోబర్ 11 నుంచి 20 వరకు విజయవాడ పున్నమి ఘాట్‌లో జరగనున్న 'విజయవాడ ఉత్సవ్'కు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌ను లోకేశ్ సాదరంగా ఆహ్వానించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు కూడా రావాలని కోరారు. గుజరాత్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలనే సంకల్పం ఉందని, ఇందుకు అవసరమైన భూమిని కేటాయించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ వెంట రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్ కూడా ఉన్నారు.

# డేటా సెంటర్లకు ఏపీ కొత్త విధానం..
# 70 శాతం గ్రీన్ ఎనర్జీ తప్పనిసరి: నారా లోకేశ్

విశాఖలో డేటా సెంటర్ల కోసం పోలవరం జలాల వినియోగం
ఏపీలో 23 రంగాల వారీగా ప్రత్యేక క్లస్టర్ల ఏర్పాటు
అమరావతిలో క్వాంటం టెక్నాలజీ ఎకోసిస్టమ్ అభివృద్ధి
2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం



**మంగళగిరి రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో ఏర్పాటు చేసే డేటా సెంటర్లు పర్యావరణ హితంగా ఉండేలా సమగ్రమైన విధానా న్ని అనుసరిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. డేటా సెంటర్లు వినియోగించే విద్యుత్‌లో కనీసం 70 శాతం సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే ఉండాలనే నిబంధనను తప్పనిసరి చేశామని ఆయన తెలిపారు.గురువారం ఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డేటా సెంటర్ల ఏర్పాటుకు పర్యావరణపరంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్ క్లస్టర్ నీటి అవసరాల కోసం పోలవరం ఎడమగట్టు కాలువ ద్వారా నీటిని తరలిస్తున్నామని చెప్పారు. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని విశాఖకు మళ్లించి డేటా సెంటర్ల అవసరాలు తీరుస్తామన్నారు. నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని, ఇప్పటికే ఒక సంస్థ ఈ దిశగా ముందుకొచ్చిందని వెల్లడించారు.రాష్ట్రంలో పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన లక్ష్యంగా 23 రంగాల వారీగా ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. సిమెంట్, ఆటోమొబైల్ వంటి సంప్రదాయ తయారీ రంగాలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రేర్ ఎర్త్ మినరల్స్, బయోమెడికల్, ఫార్మా వంటి ఆధునిక రంగాలకు కూడా ఈ క్లస్టర్లలో చోటు కల్పించామన్నారు. ఏపీలో గూగుల్ భారీ పెట్టుబడి పెడుతోందని, దీని స్ఫూర్తితో మరిన్ని కంపెనీలు డేటా సెంటర్ల రంగంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు.అమరావతి కేంద్రంగా క్వాంటం టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో భాగంగా ఐబీఎం నుంచి 150-క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అమరావతికి తీసుకొచ్చిన తొలి రాష్ట్రం ఏపీ అని గుర్తుచేశారు. ఈ సాంకేతికతకు అవసరమైన క్రయోజెనిక్స్, మెటీరియల్ సైన్సెస్ వంటి అనుబంధ రంగాలనూ అభివృద్ధి చేస్తామన్నారు.ప్రస్తుతం 200 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు అన్ని రంగాల్లోనూ రాణించాల్సి ఉంటుందన్నారు. క్వాంటం టెక్నాలజీ ఎంత ముఖ్యమో, హార్టికల్చర్, ఆక్వాకల్చర్ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. అక్టోబర్ 2న దాదాపు రూ.1 లక్ష కోట్లతో హార్టికల్చర్ మిషన్‌ను ప్రారంభిస్తున్నామని, హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో "ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్"ను ఏర్పాటు చేసి వ్యవసాయ పరిశోధనలను ప్రోత్సహిస్తామని ప్రకటించారు.

# అమరావతి మండలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి: నంబూరు



**అమరావతి, రాజధాని వాయిస్ :** అమరావతి మండలంలోని అన్ని గ్రామ పంచాయితీ లతో పాటు CRDA పరిధిలో చేరిన గ్రామాలకు స్థానికలు ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ని, నరసరావుపేట లో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల ని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు.పల్నాడు జిల్లా, అమరావతి మండలంలో మొత్తం 19 గ్రామపంచాయతీలకు గాను ఇటీవలే వైకుంఠపురం, పెదమద్దూరు, చావపాడు, ఎండ్రాయి, లేమల్లె, కర్లపూడి గ్రామాలను CRDA పరిధిలోకి తీసుకుని, ఆయా గ్రామాలలో భూసమీకరణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికల సంఘం రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో, అమరావతి మండలంలోని అన్ని గ్రామాలకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారా! లేదా కొన్ని గ్రామాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తారా? అనే అంశంపై ప్రజల్లో స్పష్టతలేదని దీనిపై వివిధ సామాజిక మాధ్యమాలలో చర్చ జరుగుతోందని తెలిపారు.గ్రామాల అభివృద్ధికి స్థానిక సంస్థలు ఎంతో కీలకమైనవని,ఎన్నికైన గ్రామసర్పంచ్ లు , ఎంపీటీసీలు మరియు జడ్పీటీసీల ద్వారా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామాలకు నిధులు అందుబాటులోకి వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావడానికి కూడా స్థానిక సంస్థలు అవసరమని అన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచికొని CRDA పరిధిలోకి వచ్చిన గ్రామాలతో సహా అమరావతి మండలంలోని అన్ని గ్రామపంచాయతీలకు, సంబంధిత ఎంపీటీసీ మరియు జడ్పీటీసీ స్థానాలకు చట్టబద్ధమైన నిబంధనలు మరియు ఎన్నికల నియమావళికి అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ని, కలెక్టర్ కృతికా శుక్ల ని పెదకూరపాడు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు కోరారు.మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అందించిన వినతి పై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల సానుకూలంగా స్పందిస్తూ చట్టభద్ధంగా, ఎన్నికల నియమావలి అనుసరిస్తూ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఇంటింటికీ టీడీపీ సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన



**మాచర్ల.సెప్టెంబర్ 24 రాజధాని వాయిస్ :** పట్టణంలోని 22వ వార్డులో బుధవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాచర్ల టీడీపీ అధ్యక్షుడు కొమెర దుర్గారావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కొమెర దుర్గారావు కోరారు. స్థానికుల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాలు.. ఈదురు గాలులు.. విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలి

- ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- ఉత్తరాంధ్రకు ఎస్పీడీసీఎల్ నుంచి అదనపు సిబ్బంది
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి.సెప్టెంబర్ 24 రాజధాని వాయిస్ :** తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు, ఈదురు గాలులు కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. తుఫాను ప్రభావం ఎక్కువగా వున్న జిల్లాల అధికారులతో తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి గురువారంనాడు సమీక్ష నిర్వహించారు. టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆయన దిశా నిర్దేశం చేశారు. విద్యుత్ స్తంభాలు పడిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపడటం వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎక్కడా ప్రాణనష్టం వాటిల్లకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. వర్షాలు, ఈదురు గాలుల నేపథ్యంలో ఉత్తరాంధ్రలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈదురు గాలులు వీస్తుండటంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. కొన్ని ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విద్యుత్ సరఫరాను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. అదే విధంగా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎస్పీడీసీఎల్ నుంచి అదనపు సిబ్బందిని, అవసరమైన మెటీరియల్‌ను ఉత్తరాంధ్ర ప్రాంతాలకు పంపినట్లు మంత్రి వెల్లడించారు. సాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొనే వరకు విద్యుత్ శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధంగా, అప్రమత్తంగా ఉండాలన్నారు.

**వైర్లు తెగిపడితే.. ప్రజలను వెంటనే అప్రమత్తం చేయాలి**

వాయుగుండం కారణంగా ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు పడిపోయినా, విద్యుత్ వైర్లు తెగిపోయినా ప్రజలను వెంటనే అప్రమత్తం చేయాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ప్రమాదకర పరిస్థితులపై ప్రజలకు తక్షణ సమాచారం చేరేలా సమాచార వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు. తెగిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు.

అలాంటి ఘటనలను గమనించిన వెంటనే సమీప విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. వర్షాలు, ఈదురు గాలుల సమయంలో విద్యుత్ వ్యవస్థపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

**విద్యుదాఘాతంతో మృతి చెందడంపై దిగ్భ్రాంతి...**

బాపట్ల మండలం, చెరువు ఉప్పరపాలెంలో తెగిన విద్యుత్ వైర్ చూసుకోకుండా తగలడంతో తల్లీ, కుమారులు మరణించడంతో పాటు నర్సీపట్నం నాతవరంలలో ఇద్దరు మహిళలు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటనలపై మంత్రి గొట్టిపాటి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. విద్యుత్ వైర్లు తెగిపడిన సందర్భాల్లో వాటిని సకాలంలో గుర్తించి ప్రమాదాలను నివారించేలా పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అదే విధంగా నర్సీపట్నం, నాతవరం ఘటనలో గాయాలపాలైన నాగరాజుకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు.

**ప్రజల భద్రతకే ప్రథమ ప్రాధాన్యత...** విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో పరిస్థితుల ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చోట్ల సిబ్బంది, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని మంత్రి గొట్టిపాటి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సరఫరా పునరుద్ధరణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సంద ర్భంగా స్పష్టం చేశారు. అదే విధంగా వర్షాలు, ఈదురు గాలుల సమయంలో ప్రజలు కూడా... తెగిపడిన విద్యుత్ వైర్లు, విరిగి పోయిన విద్యుత్ స్తంభాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు.ఎలాంటి ప్రమాదకర పరిస్థితి కనిపించినా స్వయం గా వాటిని సరి చేసే ప్రయత్నం చేయకుండా వెంటనే సమీప విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే విద్యుత్ శాఖకు అత్యంత ముఖ్యమైన బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదా లను నివారించాలని, ఎక్కడా ప్రాణనష్టం వాటిల్లకుండా బాధ్యతా యుతంగా విధులు నిర్వర్తించాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

# అగ్నిప్రమాదలపై అప్రమత్తంగా ఉండాలి ఎమ్మెల్యే జూలకంటి



**మాచర్ల.సెప్టెంబర్ 24 రాజధాని వాయిస్ :** అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. గురువారం స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసి నూతన ఫైర్ ఇంజన్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వాహనానికి పచ్చజెండా ఊపి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రమాదాల సమయంలో అగ్నిమాపక సిబ్బంది పోషించే కీలకపాత్ర ప్రశంసనీయమన్నారు. విపత్తుల సమయంలో ప్రజల భద్రత కోసం కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, కట్టుదిట్టమైన సంరక్షణ చర్యలు తీసుకుంటుందని వివరించారు ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, గోగుల వెంకటరామిరెడ్డి, కొమెర శివ, జానీ తదితరులు పాల్గొన్నారు.

# మాచర్ల అభివృద్ధికి భాగస్వాములు కావాలి ఎమ్మెల్యే బ్రహ్మానంద రెడ్డి



**మాచర్ల.సెప్టెంబర్ 24 రాజధాని వాయిస్ :** మాచర్ల పట్టణ అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ సంస్థలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. గురువారం స్థానిక శ్రీశైలం రోడ్‌లోని ఇండియన్ గ్యాస్ గూడెం ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న శ్రీ బాలాజీ టౌన్ షిప్ వెంచర్ బ్రోచర్ లాంచింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక పూజలు అనంతరం బ్రోచర్ ను ఆవిష్కరించి, సంస్థ డెవలపర్స్ కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, రాజబోయిన మధు, కళ్ళం రామాంజి రెడ్డి,గుండు కృష్ణమూర్తి, మందలపు రామకృష్ణ, వీరాస్వామి, మద్దిగపు పెద వెంకట్రామిరెడ్డి, వజం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా జగదీష్ ఆదహళ్లి బాధ్యతల స్వీకరణ



**నరసరావుపేట.సెప్టెంబర్ 24 రాజధాని వాయిస్ :** పల్నాడు జిల్లా నూతన జిల్లా ఎస్పీగా జగదీష్ ఆదహళ్లి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మొదటిసారిగా ఎస్పీగా బాధ్యతలు చేపడుతున్నందుకు ముఖ్యమంత్రి, డీజీపీ కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో ఫ్యాక్షన్ గొడవలు, రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రజలు ఎప్పుడైనా సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.అనంతరం నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల సబ్ డివిజన్ల పోలీసు అధికారులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, నరసరావుపేట డి.ఎస్.పి యం. హనుమంతరావు, సత్తెనపల్లి డి.ఎస్.పి చైతన్య, గురజాల డి.ఎస్.పి మహేశ్వరరావు, ఏ ఆర్ డి ఎస్ పి గాంధీ రెడ్డి, ఆర్ఐ లు, సీఐలు, ఎస్ఐలు నూతన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# వర్షాభావంతో నీటిలో మునిగిన వరి పంట పొలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**కొల్లూరు.సెప్టెంబర్ 24 రాజధాని వాయిస్ :** రైతులు పెట్టిన పంటలు కపడవలసిన బాధ్యత వ్యవసాయ అధికారులు పై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.,తెలిపారు. గురువారం కొల్లూరు మండలం,చినపులివర్రు గ్రామానికి చెందిన రైతుల నీటి మునిగిన వరి పంటల ను రైతులతో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులు పెట్టిన పంటలు కపడవలసిన బాధ్యత వ్యవసాయ అధికారులు పై ఉందని జిల్లా వ్యవసాయ అధికారిణి కలెక్టర్ ఆదేశించారు.ఈ మండలం పరిధిలో ఎంత మంది రైతులు ఉన్నారు, ఎన్ని ఎకరాలలో పంటలు పెట్టారు. ఎంత మంది రైతులు ఈ- క్రాప్ బుకింగ్ చేశారని,ఇంకా ఎంత మంది రైతులు ఈ - క్రాప్ బుకింగ్ చేయవలసి ఉన్నదని మండల వ్యవసాయ అధికారిణి కలెక్టర్ తెలుసుకున్నారు. వర్షం వల్ల జిల్లా పంట నష్టం ఎంత జరిగిందని వివరాలు అందజేయాలని వ్యవసాయ అధికారిణి ఆదేశించారు.సురేంద్ర అనే రైతు వరి పొలం నీట మునిగిన వరి పంటను రైతులతో కలసి పరిశీలించారు. వరి పంట పెట్టి రైతు మాట్లాడుతూ, వరి పంట పెట్టినప్పటి నుండి నీరు లేక ఇబ్బందిగా ఉన్న సమయంలో వర్షం వల్ల వరి పంట నీట మ్యూనిగిందని,డ్రైన్ పూడిపోవడంతో చిన్నపాటి వర్షానికే పొలాల్లోకి నీరు నిలిచిపోయిందని, డ్రైన్ కాల్వలు పూడిక తీయించాలని, ఇరిగేషన్ అధికారులకు డ్రైన్ కాల్వలలో పూడిక తీయించాలని చెప్పటానికి ఇరిగేషన్ అధికారులు రావడం లేదన్నారు.వెల్లటూరు నుండి చిన్న పులి వర్రు వచ్చు పంట కాలువ ( కె డబ్ల్యూ డి బ్యాంక్ ) చిన్న పులి వర్రు గ్రామ రైతుల పొలాలకు రావలసిన తూములు పగిలిపోవడం వల్ల నీరు రావడం లేదని మురుగు నీటి లో కలసిపోతుందని దీనికి మరమ్మంతులు చేయించాలని రైతులు అర్జీని కలెక్టర్ కు అందజేశారు. దీని పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని రైతులకు కలెక్టర్ చూచించారు. దేవాలయాల భూముల కు సంబంధించి సమస్యలు ఉన్నాయని రైతులు కలెక్టర్ దృష్టికీ తీసుకురాగా అలాంటి వారు గ్రామ సచివాలయం లో అర్జీలు పెట్టుకోవాలని రైతులకు చూచించారు. తెనాలి నుండి చినపులివర్రు గ్రామానికి మరియు కొల్లూరు నుండి బాపట్లకు ఆర్ టి సి బస్ సౌకర్యం కల్పించాలని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే జేసీబిలు పెట్టి డ్రైన్ పూడిక తీయించాలని కలెక్టర్ ఆర్డీఓ ను ఆదేశించారు.బస్ సౌకర్యం కల్పించుటకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,ఇరిగేషన్ అధికారుల పై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రైతులకు చూచించారు.ఇప్పటి వరకు జిల్లాలో వర్షానికి ఎంత పంట నష్టం జరిగిందన్న వివరాలుఅందజేయాలని ,మండలాల వారిగా ఈ- క్రాప్‌బుకింగ్,పంటల బీమా,ఎరువుపు పంపిణీ, ఎన్ని ఎకరాలలో వరి పంట పెట్టారు వంటి వివరాలు అందజేయాలని వ్యవసాయ అధికారిణి ఆదేశించారు.అనంతరం చిన్నపులివర్రు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి, రైతులకు అందుతున్న సేవలు, వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు, సలహాలు మరియు సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన రైతులు వరి పొలం నీటితో మునిగిపోవడం వల్ల ఆర్థికంగా నష్ట పోయామని రైతులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఎంత పంట నష్టం జరిగిందని అంచనాలు వేసి నివేదికను ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని కలెక్టర్ రైతులకు చూచించారు.కట్టా పై ఉన్న ఎస్టీ కాలనీ లో రోడ్డు సౌకర్యం కల్పించాలని కాలనీ ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సి సి రోడ్డు నిర్మాణం చేయుటకు చర్యలు తీసుకుంటామని వాటికి కలెక్టర్ చూచించారు.గ్రామానికి చెందివృద్ధ మహిళ తన మనమడు మంచానికి పరిమితం అయ్యాడని రూ.6 వేలు పింఛన్ వస్తుందని రూ.15 వేలు పింఛన్ మంజూరు చేయాలని గతంలో జిల్లా కలెక్టర్ కు అర్జీలు పెట్టుకోవడం జరిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి అర్జీని కలెక్టర్ కు అందజేసింది. అర్జీని తీసుకొని డి యల్ డి ఓ కు అందజేసి ఇప్పుడే వెళ్లి పరిశీలించి పూర్తి వివరాలు ఇవ్వాలని డి యల్ డి ఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బి.శ్రీదేవి, జిల్లా వ్యవసాయ అధికారిణి ఏ.లక్ష్మి,డి యల్ డి ఓ పద్మావతి, తహశీల్దార్, గ్రామ సచివాలయ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నాదెండ్లలో ఘనంగా జాతీయ పోషణ మాసం స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల



**నాదెండ్ల.సెప్టెంబర్ 24 రాజధాని వాయిస్ :** నాదెండ్లలో నిర్వహించిన జాతీయ పోషణ మాసం, స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, టీడీపీ నాయకురాలు నాగమల్లేశ్వరి, హెచ్‌డీఎస్ ప్రసన్న కుమారి పాల్గొన్నారు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం, పౌష్టికాహార లోపం నివారణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని కార్యక్రమంలో వివరించారుగర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని సూచించారుఅంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, అవసరమైన వైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. పౌష్టికాహారం, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై గ్రామీణ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య ప్రమాణాలను మెరుగుపరచాలని పిలుపునిచ్చారు.ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం: సాకే శైలజనాథ్



**శింగనమల, రాజధాని వాయిస్ :** ప్రజల సమస్యలపై పోరాడటం, ప్రజల పక్షాన నిలబడటమే రాజకీయ పార్టీలు, నాయకుల ప్రధాన బాధ్యత అని వైఎస్సార్‌సీపీ నేత డా. సాకే శైలజనాథ్ పేర్కొన్నారు. శింగనమల నియోజకవర్గం బుక్కరాయ సముద్రం మండలం బొమ్మలాటపల్లి సమీపంలోని ఎర్రితాత ఫంక్షన్ హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన శైలజనాథ్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. అయితే పార్టీ లక్ష్యం కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం మాత్రమే కాదని, ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై వారికి అండగా నిలవాలని కార్యకర్తలకు సూచించారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు, రైతు సంక్షేమం, విద్యార్థుల ప్రోత్సాహం, మహిళల సాధికారత, గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని శైలజనాథ్ తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో చర్చ జరుగుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడమే మంచి పాలనకు కొలమానమని వ్యాఖ్యానించారు. బుక్కరాయసముద్రం మండలంలో రైతులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. సాగునీటి కొరత, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఎరువులు, విత్తనాల ధరలు పెరగడం వంటి అంశాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రజలకు కష్టం వచ్చినప్పుడు వారి పక్కన నిలబడే నాయకుడే నిజమైన నాయకుడని శైలజనాథ్ అన్నారు. అధికారం, పదవులు శాశ్వతం కాదని, ప్రజల విశ్వాసమే శాశ్వతమని పేర్కొన్నారు. కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com